# ఎయిడ్స్... ఎయిడ్స్... ఎయిడ్స్...

అక్కడ షూటింగ్ జరుగుతూంది.

సెట్స్‌లో....

"ఆ.... రెడీయేకదా.... మీరు....?" అన్నాడు డైరెక్టర్ హీరో, హీరోయిన్లని చూస్తూ.

"మేం రెడీనే...." అన్నారు ఇద్దరూ.

"లైట్స్ ఆన్.... కెమేరా.... యాక్షన్...." అంటూ అరిచాడు డైరెక్టర్.

హీరోయిన్ ఒక చెయ్యెత్తి రెండో చెయ్యి నడుంమీద పెట్టుకుని మెడపక్కకి వాల్చి ఒక కాలుమీద బరువంతా పెట్టి రెండో కాలు పక్కకి చాపి వయ్యారంగా నిల్చుంది.

హీరో రెండుకాళ్ళు దూరందూరంగా చాపి, చంకలెత్తి ఠీవిగా నడుస్తూ హీరోయిన్ దగ్గరకి వచ్చాడు.

"జానీ...." ప్రేమనంతా గొంతులో పలికిస్తూ అన్నాడు హీరో.

"రామూ...." అంది హీరోయిన్ కూడా ఎంతో ప్రేమగా శిల్పంలా కదలకుండా అలానే నిల్చుంటూ.

"నేన్నిన్నెంతో గాఢంగా ప్రేమిస్తున్నాను జానీ...." హీరోయిన్ నడుంచుట్టూ చేతులేస్తూ అన్నాడు హీరో.

"నేను నిన్ను ప్రేమించడానికి ప్రయత్నిస్తున్నా రామూ" తన ఫోజు చెదరకుండా అలానే నిల్చుని అంది హీరోయిన్.

"జానీ...." హీరోయిన్‌ని కౌగిట్లో బంధించాడు హీరో.

"నన్ను వదలలేవా రామూ"

"లేదు జానీ...."

హీరో రెండు పెదాలూ సున్నాలా చుట్టుకుని ముందుకుసాగాయ్....
హీరో మొహంమెల్లగా హీరోయిన్ మొహం దగ్గరికి రాసాగింది.

హీరోయిన్ చట్టుక్కున మొహం పక్కకి తిప్పేసింది.

"కా....ట్...." అంటూ గావుకేక పెట్టాడు డైరెక్టర్.

హీరోయిన్ విస్మయంగా డైరెక్టర్ వంక చూసింది.

"నేను బాగా చెయ్యలేదా డైరెక్టర్‌గారు !...." అంది.

"ఏం బాగా చెయ్యడమమ్మా ?.... ఇదివరకు టూత్‌పేస్ట్ అడ్వర్టయిజ్‌మెంట్లో ఏమన్నా నటించావా?.... ఊ.... ఊ మళ్ళీ రెడీకండి...." అన్నాడు.

హీరో హీరోయిన్లు మళ్ళీ ఒకరికొకరు కాస్త దూరంలో నిల్చున్నారు.

"రెడీ లైట్స్‌ఆన్.... కెమేరా ... యాక్షన్...." గట్టిగా అరిచాడు డైరెక్టర్.

మళ్ళీ హీరోయిన్ ఇందాకట్లా వయ్యారంగా నిల్చుంది. హీరో మళ్ళీ ఠీవిగా నడుచుకుంటూ వచ్చాడు. ఇందాకటి డైలాగులన్నీ మళ్ళీ చెప్పుకున్నారు.

హీరో మూతి ముందుకు పొడుచుకు వచ్చింది.

హీరోయిన్ మళ్ళీ చటుక్కున తల తిప్పేసింది.

"కాట్.... మళ్ళీ ఏమైందమ్మా" అంటూ అరిచాడు డైరెక్టర్ నెత్తి కొట్టుకుంటూ.

"మరేమో ఈన చుంచెలుకలా మూతి చూడండి ఎలా ముందుకు పెడ్తున్నాడో ?" అంది హీరోయిన్.

"ఆ పెడ్తే పెట్టేడు. అయితే నీకేంటి నష్టం ?"

"ముద్దు పెట్టు కుంటాడేమోనని...." నసిగింది.

"అవునమ్మా.... మరి ముద్దు పెట్టుకోవాలిగా?...."

"వద్దండీ.... ముద్దు సీనుల్లో నేనుయాక్ట్ చెయ్యదల్చుకోలేదు."


డైరెక్టర్ ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు.

"అదేంటి?— నువ్వు ముద్దుసీనుల్లో నటించడానిక్కూడా సిద్ధమేనని పోయిన సంవత్సరం సినిమా పత్రికల్లో స్టేట్ మెంటిచ్చావుకదా?. ఆ స్టేట్ మెంట్ చూసే నిన్ను ఈ సినిమాలో బుక్ చేసుకున్నాం"

"అది పోయిన సంవత్సరం మాటండీ.... ఇప్పుడు మాత్రం ముద్దు సీనుల్లో నటించడానికి నాకిష్టంలేదు.... అంది హీరోయిన్.

"వా...." ఏవరో ఏడ్చారు.

అసలే చికాకుగావున్న డైరెక్టర్‌కి ఆ ఏడుపు విని మరింత చికాకు కలిగింది.




"ఎవరండీ అక్కడ? షూటింగ్ చూడడానికి వచ్చేవాళ్ళు చిన్న పిల్లల్ని తీసుకురాకూడదు. పిల్లాడిని బయటికి తీస్కెళ్ళండి...." అంటూ గావుకేక పెట్టాడు.

"సార్.... ఆ ఏడ్చేది పిల్లాడుకాదుసార్.... మన ప్రొడ్యూసర్ గారు...." అన్నాడు కెమేరామెన్ డైరెక్టర్‌తో.

14)

ప్రవేశ సంఖ్య 27.12.83
తేది

"వా...."

"ఆయనా?.. ఆయనకేం వచ్చింది?.. ఎందుకలా ఏడుస్తున్నాడు ?"

"హీరోయిన్ ముద్దుపెట్టుకోనని అంది కదండీ.... అందుకు...."

ఆయన్నిలా రమ్మను...."

"కెమేరామెన్ ప్రొడ్యూసర్ని పిలుచుకు వచ్చాడు.

"ఏమయ్యా.... ఎందుకలా ఏడుస్తావ్? హీరోయిన్ నిన్ను కాదుగా ముద్దు పెట్టుకోనని అంది.... హీరోని ముద్దు పెట్టుకోనని అంది.... నువ్వెందుకలా ఏడుస్తావ్ ?" చికాకుపడ్డాడు డైరెక్టర్.

"నన్ను పెట్టుకోకపోయినా పరవాలేదండీ.... కానీ హీరోని ముద్దు పెట్టుకోకపోతే ఎలాగండీ.... ఇప్పటిదాకా తీసిన సినిమా ఏం కావాలండీ...." అన్నాడు నిర్మాత చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకుంటూ.

"సర్లె సర్లె.... ఆ చొక్కా దించు.... ఒంటినిండా ఎలుగుబంటిగా బొచ్చు నువ్వూను ... కాస్త బనీను వేసుకుంటూ వుండవయ్యా...."

"అలాగే గానీండీ.... మరి హీరోయిన్ ముద్దుమాటేంటి?"

"ఒప్పిస్తాగా.... నీకెందుకు నువ్వలా ఉండు...." అని హీరోయిని దగ్గరికి పెళ్ళాడు డైరెక్టర్.

"హీరోని ముద్దుపెట్టుకోడానికి నీకేంటమ్మా అభ్యంతరం?...."అని అడిగాడు.

"ఎయిడ్స్ వస్తాయేమోనని అండీ.... లేపోతే నాకేంటి అభ్యంతరం !" ముఖం చిట్లించింది హీరోయిన్.

డైరెక్టర్ అదిరిపడ్డాడు.

"ఎయిడ్సా.... ఎయిడ్సెందుకు వస్తాయ్.... మరి నిన్ను నేను ఈ సిన్మాలో బుక్‌చేస్తున్నానని చెప్తే నువ్వెగిరి గంతేసి నన్ను ముద్దుపెట్టుకోలేదూ?...." అన్నాడు.

"మీరువేరు ఆయన వేరు.... మీరు ఎప్పుడూ ఫారినెళ్ళలేదు....

ఆయన ఛాంగు భళా మూవీస్‌వారి "పిచ్చి బుల్లోడు" సినిమాకోసం ఫారిన్ వెళ్ళాడుగా ?"

"అయితే ఏంటంటా?"

"ఫారిన్ వెళ్ళినవాడికి ఎయిడ్స్ రోగం రాలేదనేంటి గారెంటీ?.."

"వా...." మళ్ళీ మొదలెట్టాడు నిర్మాత.

"అబ్బ.... నువ్వుండవయ్యా.... నేను మాట్లాడుతున్నాగా.... ఆ ఏవయ్యా హీరో నీకు ఎయిడ్స్ ఉన్నాయా ?...." అంటూ హీరో వైపు తిరిగి అడిగాడు డైరెక్టర్.

"లేదండీ.... నేను ఫారిన్లో ఉన్నంతకాలం బుద్ధిగానే ఉన్నానండీ...." అన్నాడు హీరో అమాయకంగా.

"ఫారిన్లో బుద్ధిగా ఉన్నాడంటే నేన్నమ్మను. ఈయనతో ముద్దు సీన్లో నేన్నటించనుగాక నటించను.... నన్ను బుక్ చేసుకున్నప్పుడు మీరు చెప్పలేదుకూడా ముద్దుసీనుల్లో నటించాల్సి ఉంటుందని...."

"వా...." నిర్మాత మళ్ళీ రాగం ఎత్తుకున్నాడు.

"అబ్బబ్బ.... చెవిలో ఏంటయ్యా నీగోల ఏమీ తోచకుండా— నువ్వూరోకో.... నేను నచ్చజెప్తాగా ..."

"ఆయనెంతేడ్చినా నేనొప్పుకోను. చచ్చిపోటానికి ఎవరొప్పుకుంటారండీ ?" అంది హీరోయిన్ రుసరుసలాడ్తూ.

"నిన్ను చావమని ఎవరు చెప్పారమ్మా ?" డైరెక్టర్ ఆశ్చర్యంగా చూశాడు.

"చావమని విడిగా చెప్పాలా! ముద్దుపెట్టుకుంటే ఎయిడ్స్ వస్తాయ్.... ఎయిడ్సొస్తే చస్తారు...."

అక్కడ సెట్స్‌లో ఉన్న ముగ్గురు నలుగురు పత్రికా విలేకరులు హీరోచుట్టూ మూగారు.

"కాస్త మీ అనుభవాలు చెప్తారా ?" అని అడిగారు వాళ్ళు.

"ఫారిన్‌లో నా షూటింగ్ అనుభవాలా? చెప్తానుగానీ మీ పత్రికల్లో కొన్నివారాలు ఆ అనుభవాలు సీరియల్‌గా వేయాలి.... ఏం? అట్టాగేనా ?" సంబరంగా అన్నాడు హీరో.

"అబ్బే.... ఫారిన్‌లో మీ అనుభవాలగురించి కాదండీ...." అన్నాడు ఒక పత్రికా విలేకరి.

"మరి ?" ఆశ్చర్యంగా అడిగాడు హీరో.

"మరేమో మీకు ఎయిడ్స్ వచ్చాయికదా.... మీరెలా ఫీలవుతున్నారు ?...." ఒక విలేకరి అడిగాడు.

"ఎయిడ్స్ వచ్చిన తరువాత మీ శరీర స్థితిలో వచ్చిన మార్పులు గురించి చెప్తారా ?" రెండో విలేకరి అడిగాడు.

"ఇండియాలో ఎయిడ్స్ వచ్చిన మొట్టమొదటి సినిమా నటుడిగా మా పత్రిక ముఖచిత్రంగా మిమ్మల్ని వేయాలని అనుకుంటున్నాం — మీకేమైనా అభ్యంతరమా ?" మరో విలేకరి అడిగాడు.

వాళ్ళ ప్రశ్నలకి హీరోకి పిచ్చెక్కిపోయింది.

"బాబోయ్.... నాకు ఎయిడ్స్ లేవురో నాయనోయ్— మీరు నాకట్టాంటి పబ్లిసిటీ ఇవ్వకండిరో రావుడోయ్...." ఆక్రోశిస్తూ జుట్టు పీక్కున్నాడు హీరో. దాంతో చేతిలోకి విగ్గు మొత్తం వచ్చింది.

అది చూసి మేకప్‌మ్యాన్ పరుగెత్తుకు వచ్చాడు.

"మీరిలా మా హీరోగార్ని విసిగిస్తే ఎలాగండీ.... ఆయన విగ్గు పీకేస్తున్నాడు. కాస్సేపయితే బట్టలుకూడా పీకేసుకుంటారు.... మేకప్ చెయ్యలేక నేను చావాలి !" అన్నాడతను విలేకర్లతో.

"మా హీరోకేం ఎయిడ్స్ లేవండీ.... మీరాయన్ని అలా సతాయించి మూడ్ పాడుచేస్తే మా షూటింగ్ ఆపు చేసుకోవాల్సి వస్తుంది.... ఆయన్నింకేం ప్రశ్నించకండి...." డైరెక్టర్ విలేకర్లని బ్రతిమలాడాడు.

"మరి నా ముద్దు సంగతేంటి ?...." అడిగాడు నిర్మాత డైరెక్టర్ని

డైరెక్టర్ హీరోయిన్ వైపు తిరిగాడు.

"ఏమ్మా.... మరి మా ముద్దు సంగతి ఏం చేశావ్?" అని అడిగాడు.

హీరోయిన్ సిగ్గుపడుతూ అంది.

"అది షూటింగ్ అయ్యాక హోటల్ రూమ్‌కి వెళ్తాంకదా అప్పుడు."

"హబ్బా.... మా ముద్దంటే మా ముద్దు కాదమ్మా.... సినిమాలో నువ్వు హీరోకి పెట్టే ముద్దు గురించి...."

"అబ్బే లాభం లేదండీ...." ఖచ్చితంగా చెప్పింది హీరోయిన్.

"కానీ ఎలాగమ్మా.... ముద్దు సీన్ లేకపోతే సినిమానే లేదు.... హీరో ముద్దు పెట్టుకున్నాకే హీరోయిన్‌కి ప్రేమ కలుగుతుంది.... కాబట్టి ముద్దు చాలా అవసరం.

"కానీ నేను రిస్కు తీసుకో దలుచుకోలేదండీ. కథ కాస్త మార్చండి...."

"కథ మారిస్తే బావుండదే.... ఎలా?...." అని కాస్సేపు ఆలోచించాడు డైరెక్టర్.

అయిదు నిమిషాల తరువాత అతనికి బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

"ఒరేయ్ కన్నయ్యా ఇలా రారా...." అని పిలిచాడు డైరెక్టర్ ఓ మూలగా నిల్చున్న కన్నయ్యని చూస్తూ.

కన్నయ్య దగ్గరికి వచ్చాడు. కన్నయ్య ఆ సినిమాలో హీరోకి డూప్‌గా పనిచేస్తున్నాడు.

"చూడు ప్రొడ్యూసరూ.... ఇంతకాలం అందరూ సినిమాల్లో డూప్‌లని కేవలం స్టంట్‌లకి వినియోగిస్తూ వచ్చారు.... మనం ముద్దు

సీనుకు కూడా ఉపయోగిస్తున్నామన్నమాట.... డూప్ హీరోయిన్ని ముద్దు పెట్టుకుంటుంటే లాంగ్‌షాట్‌లో చిత్రీకరిస్తాం.... ఏమ్మా .. నీ కభ్యంతరం లేదుకదూ ?" అని హీరోయిన్ని అడిగాడు డైరెక్టర్.

"ఏవయ్యా.... నీతో ఫారిన్లో స్టంట్‌సీన్లు ఎప్పుడైనా తీశారా ?" అంటూ కన్నయ్యని అడిగింది హీరోయిన్.

"లేదు...." బదులుచెప్పాడు కన్నయ్య.

"అయితే నాకభ్యంతరం లేదు" అంది హీరోయిన్.

"కానీ నాకభ్యకతరం ఉంది" గావుకేక పెట్టాడు హీరో. "నాకు రావాల్సిన ఛాన్సు నా డూప్ కొట్టేస్తే నేవూరుక్కుంటానా? అహ అశ, దోశ, అప్పడం,వడ...." అన్నాడు చంక కింద కొట్టుకుంటూ....

డూప్ కన్నయ్యకి చాలా కోపం వచ్చింది.

"ఇలాగైతే ఎలాగండీ — ఫైటింగ్ సీనుల్లో చచ్చేట్లు తన్నులు తినడానికేనా నన్ను డూప్‌గా పెట్టుకునేది. ఇలాంటి ముద్దు సీనుల్లో రేప్ సీనుల్లో డూప్‌గా పెట్టుకోరా ?" అన్నాడు డైరెక్టర్‌తో.

"చూడు హీరో! హీరోయిన్ ఎలాగూ నీతో ముద్దుసీనుకి ఒప్పుకోవడం లేదు.... కనుక ఆ సీను ఎవరితో ఒకరితో మేనేజ్‌చేయక తప్పదు...." అన్నాడు హీరోతో డైరెక్టర్.

నిర్మాత కూడా హీరోకి సర్ది చెప్పాడు.

మళ్ళీ షాట్ తీయడానికి సన్నాహాలు మొదలయ్యాయి.

హేర్ డ్రెస్సర్ కన్నయ్య జుట్టుని హీరో క్రాపులో సెట్ చేశాడు వెనకాల కొన్ని జుట్టు కత్తిరిస్తే సరిపోతుంది.

హేర్ డ్రెస్సర్ కన్నయ్య జుట్టు కాస్త కత్తిరించి తరువాత కత్తి తీశాడు.

"అదెందుకు ?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"వెనకాల మెడమీద వెంట్రుకలు కత్తితో గీకాలి !" అన్నాడు హేర్ డ్రెస్సర్.

ఆ మాట వింటూనే గజగజ వణికిపోయాడు. "వద్దు.... వద్దు...." అన్నాడు.

"అలా వణికిపోతావేం?......నేనేం నీ పీక తెగ్గొయ్యడానికి కాదు లేవయ్యా కత్తి తీసింది.... మెడమీద వెంట్రుకలు గీయాలి"

"కత్తితో వద్దు.... మిషన్‌తో తీసెయ్ ఆ వెంట్రుకలు....

"కత్తి అయితే ఏం ?"

"ఏమో.... ఆ కత్తితో ఏ ఎయిడ్స్ ఉన్నవాడికి గీకావో ఏంటో?.. నాకూ ఎయిడ్స్ వస్తుంది...."

"సరే నీకంత భయం అయితే ఏం చేస్తాం ?"

హేర్ డ్రెస్సర్ మిషన్‌తో మెడమీద వెంట్రుకలు తీసేసాడు.

మేకప్‌మేన్ కన్నయ్యకి పూర్తిగా హీరో గెటప్ ఇచ్చి మేకప్ చేసేసాడు.

షూటింగ్‌కి అందరూ సిద్ధం అయ్యారు.

"సార్.... పక్క ఫ్లోర్‌లో "దొంగ పీనుగ" సినిమా షూటింగ్ ప్రారంభించడానికి మినిస్టర్ పిచ్చయ్యని పిలిచారు.ఆయనఇప్పుడేవచ్చారు. బహూశా ఇప్పుడు పూజ కార్యక్రమం జరుగుతూ వుంటుంది సార్..మనం మనషూటింగ్ ప్రారంభించడానికిపిచ్చయ్యగార్ని ఆహ్వానిస్తేఆయనకిఅప్పుడు పని ఉండిరాలేకపోయారుకదా సార్.ఆయనచేత కనీసంఇప్పుడు ఈసీనుకిక్లాప్ కొట్టిద్దాం సార్.... ఆయన మీకు బాగా పరిచయం ఉన్నవారే కదా సార్.... వెళ్ళి పిలుచుకురండి సార్" అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్ డైరెక్టర్‌తో.

"నిజమే ఉండు ఇప్పుడే అతన్ని తీసుకొస్తాను...." అంటూ డైరెక్టర్ పక్క ఫ్లోర్‌కి వెళ్ళాడు.

ఒక పది నిమిషాల తరువాత డైరెక్టర్ మినిస్టర్ పిచ్చయ్యని వెంట బెట్టుకుని వచ్చాడు.

ఆశ్చర్యం !....

అక్కడెవరూ లేరు .... ఫ్లోరంతా ఖాళీగా ఉంది.... ఒకమూల మాత్రం ప్రొడ్యూసర్ కుమిలిపోయి ఏడుస్తూ కూర్చున్నాడు.

"అందరూ ఏమైపోయారు?...." కంగారుగా ప్రొడ్యూసర్ని అడిగాడు డైరెక్టర్.

"మీరు వీరిని తీసుకురావడానికి వెళ్ళారని తెలిసి అందరూ పారిపోయారు నాయనోయ్...."

ఘొల్లుమన్నాడు ప్రొడ్యూసరు.

"అదేంటి.... ఈయన్ని తీసుకొస్తే వాళ్ళకొచ్చిన భయం ఏంటంటా?...." ఆశ్చర్యపోయాడు డైరెక్టర్.

ఈయనకి మొన్నీమధ్య జలుబుచేస్తే గవర్నమెంట్ ఖర్చులతో ఫారిన్ వెళ్ళి ట్రీట్మెంట్ తీసుకున్నారుగా?" వెక్కుతూ అన్నాడు ప్రొడ్యూసరు.

"అయితే...."

"ఫారినెళ్ళివచ్చాడుగా.... ఈయనకి ఎయిడ్స్ ఏమైనా ఉన్నాయేమోననీ...."

"హా...." అంటూ జుట్టు పీక్కున్నాడు డైరెక్టర్.

"ఆహా!!...." అంటూ మినిస్టర్ పిచ్చయ్య కూడా జుట్టుపీక్కుని ఆక్రోశించాడు.

"మీరెందుకు ఆక్రోశించారు?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు డైరెక్టర్.

"లేకపోతే ఏందయ్యా.... నేనేడికెళ్ళినా జనాలు భయపడి సత్తున్నారు.... మొన్న అసెంబ్లీకెళ్ళేముందు ప్రెతిపచ్చం వాళ్లు లేసెళ్ళిపోయారు. అళ్ళు వాకౌట్ చేశారని అనుకున్నా.... తీరా సూస్తే నిమిసం

తరువాత అధికార పార్టీవోళ్లూ లేసెళ్ళిపోయారు.... నేను ఇదేశా
కెళ్ళడమూ పాపమేనా? అంతెందుకు ఇందాక పూజదగ్గరకూడా ఎవరు
వుంచకుండా ఎల్లిపోయారు...." వాపోయాడు పిచ్చయ్య.

డైరెక్టర్ మినిస్టర్‌కి సారీ చెప్పి సర్ది చెప్పాడు.

"ఇంకెళ్తా.... ఏ ప్రారంభోత్సవానికి పిలిశారు.... అక్కడై
జనం నన్నుచూసి ఉంటారో పారిపోతారో...." అన్నాడు.

"అలాగే.... వెళ్ళిరండి...." అన్నాడు డైరెక్టర్.

"సరేగానీ.... మీకు పెళ్ళికాలేదని ఆ మధ్య చెప్పారు....ఇప్పుడ
చేస్కున్నారా?" అని అడిగాడు పిచ్చయ్య.

"లేదు."

"మొన్నో పేపర్లో చదివాను. పెళ్ళి చేస్కోకుండా ఉంటే ఎం
డొస్తాయట.... త్వరగా పెళ్ళి చేస్కోండి...."

"పెళ్ళి చేస్కుంటే ఎయిడ్స్‌రావా?"

"ఏమోగాని అప్పుడు కాన్సర్ రావడానికి అవకాశాలెక్కువ ...
వస్తామరి.... క్యాన్సర్ కావాలో ఎయిడ్స్ కావాలో ఏదో ఒకటి తేలు
కోండి...." అని చెప్పివెళ్ళిపోయాడు పిచ్చయ్య.

డైరెక్టర్ నోరుతెరిచాడు.

(ఈమధ్య ఏ పత్రిక చూసినా ఎయిడ్స్ గురించిన వార్తలే...
రేడియో పెట్టినా, టీవీ పెట్టినా ఈ సోదే. భయంకరమైన రోగాలు టీ
క్యాన్సర్, కుష్టు రోగాలు లాంటివి ఇదివరకటినుండే ఉన్నాయ్. అలాగ
ఆ రోగాలు మనకే వస్తాయేమోనని మనం అనవసరంగా భయపడ్తున్నామ
ఆ రోగాలు ఎవరికైనా వచ్చే అవకాశం ఉంది. ఎయిడ్స్ అందరికీ వచ్చే
రోగంకాదు. జాగ్రత్త మంచిదేగాని దానిగురించి ప్రొద్దస్తమానం భం
పడడం అనవసరం. -రచయిత)